నమస్తే తెలంగాణ

రాజన్న సిరిసిల్ల

8 | కరీంనగర్, ఆదివారం 11 మే 2025 | RAJANNA SIRCILLA


## మావోయిస్టులతో చర్చలు జరపాలి

తెలంగాణచౌక్, మే10 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టులతో చర్చలు జరపాలని శాంతి చర్చల కమిటీ చైర్మన్ విశ్రాంత న్యాయాధికారి చంద్రకుమార్ కోరారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రాష్ట్ర జిల్లా పౌర హక్కుల సంఘం నాయకులతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం నిలిపివేయాలన్నారు. వేలాది మంది కేంద్ర బలగాలలో కర్రె గుట్టల్లో చేపడుతున్న కూంబింగ్‌తో ఆదివాసులు, మావోయిస్టులు, పోలీసులు చనిపోతున్నారని, ప్రాణ నష్టంతో ఎవరికి ప్రయోజనంలేదని చెప్పారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ ఎల్కతుర్తి సభలో డిమాండ్ చేయగా, ప్రజల నుంచి స్పందన వచ్చిందని తెలిపారు. శాంతి కమిటీ కోరిక మేరకు మావోయిస్టులు చర్చలకు సిద్ధంగా ఉన్నామని లేఖలు కూడా విడుదల చేశారని తెలిపారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశామని, ఈ నెల 9న ఢిల్లీలో లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీని విన్నవించినట్లు వివరించారు. చర్చల ప్రసక్తిలేదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రకటనలు చేయడం సరికాదన్నారు. చర్చలతోనే సమస్యలను పరిష్కారం అవుతాయని, ప్రభుత్వాలు హింసను ప్రోత్సహించకుండా చర్చలకు ముందుకు రావాలని సూచించారు. కూంబింగ్‌లో మరణించిన ఆదివాసి, మావోయిస్టు. పోలీసుల కుటుంబాలకు ప్రగాఢసానుభూతి తెలిపారు. ఇక్కడ రాష్ట్ర జిల్లా పౌర హక్కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.



మధురానగర్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న చిన్నారులు

## వీరుడా వందనం

- నీ త్యాగం ఎన్నటికీ మరువం
- అమరుడు మురళీనాయక్‌కు ఘన నివాళి
- ఉమ్మడి జిల్లాలో కార్యక్రమాలు

పెద్దపల్లిటౌన్, మే 10 : భారత్– పాకిస్థాన్ ఉద్రిక్తతల మధ్య వీరమరణం పొందిన అమరులకు సకలజనం వందనం చేస్తున్నది. రెండ్రోజుల క్రితం యురిలో అక్రమంగా చొరబడ్డ ముష్కరులను ఎదుర్కొనే క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో వీరమరణం పొందిన యువ సైనికుడు మురళీనాయక్‌కు ఘన నివాళులర్పించింది. 'వీరుడా వందనం' అంటూ కీర్తిస్తున్నది. శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మురళీనాయక్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. నీ మరణం వృథాగా పోదని, నీ త్యాగం ఎన్నటికీ ఈ గడ్డ మరువదని, సైనికా వందనం అంటూ ప్రతిజ్ఞ చేశారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద పలు సంఘాల నాయకులు మురళీ నాయక్ చిత్ర పటానికి పూలు వేసి ఘన నివాళుర్పించారు. గంగాధర మండలంలోని మధురానగర్ చౌరస్తాలో చిన్నారులు ర్యాలీ తీసి, కొవ్వొత్తులతో నివాళులర్పించారు.

## కరెంట్ బిల్లింగ్ సిబ్బంది మాయాజాలం

### 'గృహజ్యోతి' ఆసరాగా వసూళ్ల పర్వం

- 200 యూనిట్లు దాటిన వారికి జీరో బిల్లు ఎర
- వినియోగదారుల నుంచి రూ.200 నుంచి రూ.300 వసూలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి.. పట్టించుకోని ఉన్నతాధికారులు



**విద్యుత్‌శాఖ స్పాట్ బిల్లింగ్ సిబ్బంది తప్పుదోవలో పోతున్నది. కాసుల కక్కుర్తితో ప్రభుత్వ ఆదాయానికే గండికొడుతున్నది. రాష్ట్ర సర్కారు గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు వాడుకున్న పేదలకు ఫ్రీ కరెంట్ ఇస్తుండగా, పరిమితి దాటిన వారికి సైతం జీరో బిల్లు ఇప్పిస్తామంటూ వసూళ్ల పర్వానికి దిగుతున్నది. ఇందులో ఒక పద్ధతిలో బిల్స్ కొట్టే క్రమంలో యూనిట్లు తక్కువగా ఎంటర్ చేయడం, మరో పద్ధతిలో తమ ఆఫీస్‌లోని కంప్యూటర్ సెక్షన్‌లో సిబ్బందితో మాట్లాడి రీడింగ్ అవకతవకలకు పాల్పడుతున్నది. ఒక్కో వినియోగదారుడి నుంచి రూ.200 నుంచి రూ.300 తీసుకుంటూ జేబులు నింపుకుంటున్నట్లు సొంత శాఖలోని సిబ్బంది నుంచే ఆరోపణలు వెల్లుత్తుతుండగా, పట్టని ఉన్నతాధికారుల తీరు విమర్శలకు తావిస్తున్నది.**

పెద్దపల్లి, మే 10(నమస్తే తెలంగాణ): ప్రభుత్వం పేదల కోసం గృహ జ్యోతి పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. 200 యూనిట్లలోపు వాడుకున్న వారికి జీరో బిల్లు ఇస్తున్నది. పథకం కింద పెద్దపల్లి జిల్లాలో ఎన్‌పీడీసీఎల్ సర్కిల్ పరిధిలోని 1.76 లక్షల మంది అర్హులుగా ఉన్నారు. ప్రతి నెలా స్పాట్ బిల్లర్స్ ఇంటింటికీ వెళ్లి రీడింగ్ తీసి బిల్లు ఇస్తుంటారు. సాధారణంగా వేసవిలో వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో ఏసీ, కూలర్ ఎక్కువగా వాడే ఇంట్లో రీడింగ్ 200 యూనిట్లు దాటిపోతుంటుంది. అయితే, ఇదే అదనుగా పలువురు స్పాట్ బిల్లర్స్ జేబులు నింపుకొంటున్నారు. పరిమితి దాటిన వారికి జీరో బిల్లు ఇప్పిస్తామంటూ వసూళ్ల పర్వానికి దిగుతున్నారు.

### వసూళ్ల పర్వం ఇలా..

ఎన్‌పీడీసీఎల్ సర్కిల్లోని పెద్దపల్లి, మంథని డివిజన్ల పరిధిలోని ఈ తంతు ఎక్కువగా జరుగుతున్నట్లు తెలిసింది. 200 నుంచి 300 యూనిట్ల మధ్యలో రీడింగ్ నమోదైతే జీరో బిల్లు వచ్చేలా చేస్తామంటూ సంబంధిత వినియోగదారుడి వద్ద బహిరంగంగానే రూ.200 యూనిట్లు నుంచి రూ.300 వసూలు చేస్తున్నట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. ఇందుకు ఒక పద్ధతిలో బిల్స్ కొట్టే క్రమంలో యూనిట్లు తక్కువగా ఎంటర్ చేయడం, మరో పద్ధతిలో తమ ఆఫీసులోని కంప్యూటర్ సెక్షన్‌లో సిబ్బందితో మాట్లాడి రీడింగ్‌ను కుదిస్తున్నారని, ఎన్‌పీడీసీఎల్ సిబ్బంది బహిరంగంగా చెబుతున్నారు. సంబంధిత ఏఈ, ఏఈడీలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే తతంగం నడుస్తుందని విమర్శిస్తున్నారు.



### తనిఖీలు చేస్తాం..

బిల్లింగ్‌లో ఐఆర్‌డీఏ పద్ధతి, ఓసీఆర్ పద్ధతిలో తీసుకుంటే ఇలాంటి అవకతవకలు జరగడానికి వీలు లేదు. 95 శాతం జిల్లాలో ఆ రెండు పద్ధతుల్లోనే బిల్లింగ్ జరుగుతున్నది. కేవలం ఐదు శాతం మాత్రమే మాన్యువల్‌గా జరుగుతున్నది. అయితే, గృహ జ్యోతిలో ఎలాంటి అక్రమాలకు అవకాశం ఇవ్వకుండానే చూస్తున్నాం. 190 యూనిట్ల నుంచి 200 యూనిట్ల వరకు వచ్చే బిల్లులను ప్రత్యేకంగా తనిఖీలు చేస్తాం. ఏవైనా తేడాలుంటే సరి చేస్తాం. ఎవరు డబ్బులు అడిగినా వినియోగదారులు ఇవ్వవద్దు.

– మాధవరావు, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ (పెద్దపల్లి)



కరీంనగర్: ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా నినదిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మహిళలు, నాయకులు

## జాతీయతను చాటుదాం

- ఆపరేషన్ సిందూర్ కోసం ఐక్యంగా ఉందాం
- మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పిలుపు
- దేశ రక్షణ నిధికి నెల వేతనం విరాళం

కరీంనగర్ కార్పొరేషన్, మే 10 : దేశంలోని ప్రతి ఒక్కరం ఆపరేషన్ సిందూర్ కోసం ఐక్యంగా జాతీయతను చాటుదామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సూచించారు. శనివారం కరీంనగర్‌లోని మార్కెట్ రోడ్డులో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో భారత సైనికులకు మద్దతుగా ప్రత్యేక పూజలు చేశారు. గోవిందాపతి సేవా సంస్థ, శ్రీ సేవామార్గ సంస్థ, కిట్టీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో సిందూరంతో చేతి ముద్రలను వేసి భారత ప్రభుత్వానికి పంపించారు. దేవాలయం వద్ద జాతీయ జెండాలతో సైనికులకు మద్దతుగా నినదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాయాది దేశానికి వణుకు పుట్టేలా భారత ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ దేశానికి గర్వకారణమన్నారు. పార్టీలకు అతీతంగా అందరూ ఒక్కటై కేంద్ర ప్రభుత్వానికి, భారత ఆర్మీకి మద్దతు ఇవ్వాలన్నారు. యుద్ధంలో వీరమరణం పొందిన తెలుగు బిడ్డ మురళీనాయక్ ఆత్మకు శాంతి కలుగాలని ఆకాంక్షించారు. వారి బలిదానం వృథాగా పోదని, వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సూచన మేరకు తన నెల వేతనాన్ని భారత ఆర్మీకి అందిస్తున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన చెక్కును కలెక్టర్‌కు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గోవిందపతి సేవా సంస్థ ఫౌండర్ చైర్మన్ పాలవేడు శ్రీనివాస్, పడకంటి ఇందు, పద్మ, సరళ, కిట్టి మహిళలు భాగ్య, సుమ, శ్రీ సేవామార్గ్ సంస్థ అధ్యక్షురాలు ఫణిత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



తంగళ్లపల్లి మండలాధ్యక్షుడు భాస్కర్‌గౌడ్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్, తంగళ్లపల్లి నేతలు

## రాబోయేది బీఆర్ఎస్ సర్కారే

- కేసీఆర్ మూడోసారి సీఎం అయ్యేవరకు విశ్రమించేదిలేదు
- రేవంత్ సర్కార్ అన్ని విభాగాల్లో విఫలం
- నాలుగు లక్షల మందితో ఇప్పటికే కేటీఆర్ సైన్యం సిద్ధం
- కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్
- తంగళ్లపల్లిలో కేటీఆర్ సేన సన్నాహక సమావేశం

సిరిసిల్ల రూరల్, మే10: రేవంత్‌రెడ్డి సర్కార్ అన్నివిభాగాల్లో విఫలమైందని, ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి.. వాటిని అమలు చేయకుండా మోసం చేస్తున్నదని కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ పేర్కొన్నారు. రాబోయే బీఆర్ఎస్ సర్కారేనని.. కేసీఆర్ మూడోసారి సీఎం అయ్యేవరకు విశ్రమించబోమని స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌లోని ఫంక్షన్‌హాల్‌లో కేటీఆర్ సేన తంగళ్లపల్లి మండలాధ్యక్షుడు నందగిరి భాస్కర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశానికి మనోహర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2010లోనే కేటీఆర్ సేనకు శ్రీకారం చుట్టామని, తెలంగాణ ఉద్యమంలో కేటీఆర్ వెంటనే సైనికుల్లా పని చేశామన్నారు. 2014లో కేటీఆర్ సేనను రిజిస్టర్ చేసి, కేటీఆర్ సేనను బలోపేతం చేశామన్నారు. ప్రస్తుతం 23 జిల్లాలో కేటీఆర్ సేన విస్తరించామని, 18జిల్లాలో కమిటీలను వేశామన్నారు. ఇప్పటికే 4లక్షల మంది కేటీఆర్ సేన సైనికులు తయారయ్యారని పేర్కొన్నారు. 6 గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ఎండగడుతామన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ, రేవంత్‌రెడ్డిని దోషిగా నిలబెడుతామన్నారు. కేసీఆర్ పాలనలో దేశంలో నంబర్‌వన్‌గా ఉన్న తెలంగాణను కుక్కలు చింపిన విస్తరిలా చేశారన్నారు. తంగళ్లపల్లి మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న మాట్లాడుతూ, కేటీఆర్ సేన ద్వారా రామన్నకు మంచి పేరు తేవాలని, ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. కేటీఆర్‌సేన మండలాధ్యక్షుడు నందగిరి భాస్కర్‌గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ మోసాలను ప్రజలకు వివరిస్తామన్నారు. త్వరలోనే అన్ని గ్రామాల్లో కేటీఆర్ సేన కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం మెంగని మనోహర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, పీఏసీఎస్ చైర్మన్లు బండి దేవదాస్‌గౌడ్, కోడూరి భాస్కర్‌గౌడ్, వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు అంకారపు రవీందర్, మాజీ ఎంపీపీ పడిగెల మానస, ఏఎంసీ మాజీ చైర్మన్ పూసపల్లి సరస్వతి, మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య, పడిగెల రాజు, తెలంగాణ జాగృతి మండలాధ్యక్షుడు కందుకూరి రామాగౌడ్, బండి జగన్, మోర నిర్మల, కేటీఆర్ సేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### నియామక పత్రాలు అందజేత

తంగళ్లపల్లి కేటీఆర్ సేన మండలాధ్యక్షుడు నందగిరి భాస్కర్‌గౌడ్, సోషల్ మీడియా అధ్యక్షుడు పిట్ల విన్నుబాబు, మండల ఉపాధ్యక్షుడు మామిడాల విజయ్, రేగుల రాజు, ప్రధాన కార్యదర్శి తౌటి శివకృష్ణ, మండల ఇన్‌చార్జి ఉమాశంకర్, ప్రచార కార్యదర్శి గడ్డం అజయ్‌కి రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, తంగళ్లపల్లి నేతలు నియామక పత్రాలు అందజేశారు. నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

## ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్ టూలో చికిత ప్రతిభ

### భారత్‌కు సిల్వర్ మెడల్



తానిపర్తి చికిత

పెద్దపల్లి, మే 10(నమస్తే తెలంగాణ): చైనాలోని అవైల్లో జరుగుతున్న ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్ టూ పోటీల్లో పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన తానిపర్తి చికిత ప్రతిభ చూపింది. ప్రపంచంలోని 30 దేశాలు పాల్గొనగా, ఈ పోటీల్లో భారత్ నుంచి ఆమెతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి జ్యోతి సురేఖ, మహారాష్ట్ర నుంచి మధుర పాల్గొని సత్తా చాటడంతో భారత్‌కు సిల్వర్ మెడల్ లభించింది. ఇది దేశానికి మొదటి పతకం కావడం విశేషం. తనను ఆర్చరీ శిక్షణ కోసం ప్రోత్సహించి, సహకారాన్ని అందించిన జిల్లాలో గతంలో పనిచేసిన కలెక్టర్లు శ్రీదేవసేన, ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ సర్వే సంగీత సత్యనారాయణ, ప్రస్తుత కలెక్టర్ కోయ శ్రీహర్షకు చికిత కృతజ్ఞతలు తెలిపింది. భవిష్యత్తులో దేశం తరపున క్రీడల్లో పాల్గొని అర్చరీలో మరిన్ని పతకాలు సాధిస్తానని తెలిపింది.



వైకుంఠధామంలో ఆరబోసిన ధాన్యం

## వైకుంఠధామంలో వడ్ల కుప్పలు

కొనుగోలు కేంద్రంలో సరిపడా స్థలం కరువు

సారంగాపూర్, మే 10: వైకుంఠధామం కాస్త.. వడ్ల ధాన్యం కుప్పలతో నిండిపోయింది.

వరి ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు సరిపడా స్థలం లేకపోవడంతో రైతులు శ్మశానవాటికలో వడ్లు పోశారు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వడ్లు ఆరబోసేందుకు సరిపడా స్థలాలు లేకపోవడంతో రైతులు నానాఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో గ్రామ శివారులోని వైకుంఠధామంలో వడ్లు ఆరబోశారు. ఇప్పటికైనా సంబంధితశాఖల అధికారులు స్పందించి ధాన్యం ఆరబోసేందుకు అనువైన స్థలం ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచ్ రిక్కల ప్రభాకర్, రైతులు కోరారు.



జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న పుట్ట మధూకర్

## సైనికుల త్యాగాలు వెలకట్టలేనివి

- వారి కుటుంబాలకు అండగా ఉంటాం
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్
- మంథనిలో భారీ ర్యాలీ

మంథని, మే 10: పాకిస్థాన్‌తో యుద్ధం చేస్తూ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడిన సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ కొనియాడారు. ఈ మేరకు భారత ఆర్మీ జవాన్లకు మద్దతుగా శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి మంథనిలో జాతీయ జెండాలను పట్టుకొని రాజగృహ నుంచి ప్రధాన చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పుట్ట మధూకర్ మాట్లాడుతూ.. పహల్గాంలో దాడి చేసిన 15 రోజులకే ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత ఆర్మీ పాకిస్థాన్ ఉగ్రవాదులను హతం చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ఎంతో మంది అమాయక ప్రజల ప్రాణాలను తీసిన ఉగ్రవాదులపై భారత ఆర్మీ దాడి చేసి గట్టి బుద్ధి చెప్పిందని, భారత సైన్యం ప్రదర్శించిన పాటవానికి ప్రతీ భారతీయుడు గర్వపడుతున్నారన్నారు. యుద్ధంలో ప్రాణాలను త్యాగం చేసిన జవాన్ల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అగ్నివీర్ జవాన్ మురళీ నాయక్ అమరుడు కావడం బాధాకరమన్నారు. అనంతరం మురళీనాయక్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జక్కు రాకేశ్, ఎగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, పూదరి సత్యనారాయణ, ఎస్కే యాకుబ్, మాచీడి రాజుగౌడ్, కన్నూరి శ్రీశైలం, ఆరెపల్లి కుమార్, ఎంఎస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నేతన్నచౌక్‌లో ఆందోళన చేస్తున్న కార్మికులు

## వార్పిన్ కార్మికుల ఆందోళన

రాజన్న సిరిసిల్ల, మే 10 (నమస్తే తెలంగాణ): కూలీ రేట్లు పెంచాలని వార్పిన్ కార్మికులు చేస్తున్న సమ్మె ఆరో రోజుకు చేరుకున్నది. పాలిస్టర్ వస్త్ర ఉత్పత్తిదారుల మొండి వైఖరి, చేనేత జౌళీశాఖ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు శనివారం నేతన్న విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం అక్కడే ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ మాట్లాడుతూ, రెండురోజుల్లోగా కూలీరేట్లు పెంచాలని డిమాండ్‌చేశారు. లేదంటే యజమానుల సంఘ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. పని భారానికి అనుగుణంగా వార్పిన్ కార్మికులకు కూలీరేట్లు పెంచి నిర్ణయించాలనే డిమాండ్‌ను యజమానులు కాలరాస్తున్నారన్నారు. చీరెల తయారీకి మీటరు వస్త్రానికి ప్రభుత్వం రూ.2 అదనంగా పెంచినప్పటికీ.. యజమానులు ఇవ్వకుండా కార్మికుల కడుపు కొడుతున్నారని విమర్శించారు. చేనేత జౌళీశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. సమస్య పరిష్కారమయ్యే వరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వార్పిన్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఉడుత రవి, అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, యూనియన్ నాయకులు మచ్చ వేణు, బూట్ల వెంకటేశ్వర్లు, ఐరేని ప్రవీణ్, అవదూత హరిదాసు, ఆడిచర్ల రాజు, శ్రీకాంత్, రమేశ్, మధు, శంకర్, సదానందం, రాజు, శేఖర్, సతీశ్, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షం.. తడిసిన ధాన్యం

- కొనుగోలు కేంద్రాల్లో ముద్దయిన వడ్లు
- వాన నీటిలో కొట్టుకుపోతుంటే తల్లడిల్లిన రైతులు



ధర్మారం: మార్కెట్ యార్డులో వరదకు కొట్టుకు పోతున్న ధాన్యం

పెద్దపల్లి, మే 10 (నమస్తే తెలంగాణ): పెద్దపల్లి జిల్లాలో శనివారం సాయత్రం కురిసిన భారీ వర్షంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. జిల్లా కేంద్రంతోపాటు ధర్మారం మండలంలో కురిసిన వర్షం జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. బలమైన గాలులతోపాటు వడగండ్ల వానతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కళ్ల ముందే వాననీటిలో కొట్టుకుపోతుంటే రైతులు తల్లడిల్లిపోయారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు, ధర్మారం మండలంలోని పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. వరద ఉధృతికి కొందరు రైతుల ధాన్యం కొట్టుకుపోయింది. అకాల వర్షంతో తాము తీవ్రంగా నష్టపోయామని రైతులు తెలిపారు. జిల్లా కేంద్రంలో 153 మిల్లీ మీటర్ల వర్షం పడగా, పాలకుర్తి, అంతర్గాం మండలాల్లో 2.3మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీగా కురిసిన వర్షానికి పలుచోట్ల చెట్లు పడిపోగా, రవాణాకు ఆటంకం ఏర్పడింది. ప్రధాన రహదారులపై వరద నీరు వచ్చి చేరడంతో ట్రాఫిక్ అంతరాయం కలిగింది. బలమైన ఈదురుగాలులతో జిల్లా కేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. భారీ వృక్షాలు నేలకొరగడంతో పాటు స్తంభాలు కింద పడిపోవడంతో విద్యుత్ తీగలు తెగిపోయాయి. సాయంత్రం 6గంటలకు నిలిచిపోయిన విద్యుత్ రాత్రి వరకు కూడా రాకపోవడంతో ప్రజలకు ఆంధకారంలో బిక్కుబిక్కుమంటూ ఉన్నారు.



పెద్దపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పల మధ్య వరదనీరు



కొట్టుకు పోయిన ధాన్యాన్ని కుప్పలా చేస్తున్న రైతు